క్లుప్తంగా

24,800 ఎకరాల్లో ఈ-పంట నమోదు



షేక్ ఇమామి

రాజానగరం: మండల వ్యాప్తంగా ఇప్పటివరకూ 24,800 ఎకరాలకు సంబంధించిన వివరాలు ఈ-పంటలో నమోదు చేసుకున్నారని వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిం తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకోవాల్సిన రైతులు ఇంకా మిగిలిపోయిన నేపథ్యంలో గడువును సెప్టెంబర్ 23వ వరకూ పెంచారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తక్షణమే రైతులు సమీపంలోని గ్రామ సచివాలయాలకు వెళ్లి, ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని సూచించారు.

'నన్నయ'లో మోక్షగుండం జయంతి



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న 'నన్నయ' అధికారులు

రాజానగరం: దేశాభివృద్ధిలో ఇంజినీర్లదే కీలక పాత్రని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజినీర్స్ డే సందర్భంగా యూనివర్సిటీలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సివిల్, మెకానికల్ అనే తేడా లేకుండా మౌలిక సదుపాయాల కల్పనకు వెన్నెముకగా నిలవాలన్నారు. మోక్షగుండం అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని, ప్రతి ఒక్కరూ సమాజ హితంగా పయనించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రదానం



ఆలూరి లక్ష్మికి పీహెచ్‌డీని అందజేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ నుంచి ఆలూరి లక్ష్మికి ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు పీహెచ్‌డీని మంగళవారం ప్రదానం చేశారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో 'వివిధ డీప్ లెర్నింగ్ పద్ధతుల ద్వారా తెలుగు ఆర్టికల్స్ టెక్స్‌ని సంక్షిప్తం చేసే విధానాలపై ఆమె ఫుల్ టైమ్ రీసెర్చ్ స్కాలర్‌గా సమర్పించిన పరిశోధనకు గాను ఈ పీహెచ్‌డీని అందుకున్నారు. ప్రొఫెసర్ డి.లత ఆమెకు గైడ్‌గా వ్యవహరించారు.

మానసిక ప్రశాంతతకు ధ్యానం అవసరం



ధ్యానం చేస్తున్న పిరమిడ్ కేంద్రం సభ్యులు

రంగంపేట: శారీరక, మానసిక ప్రశాంతతకు రోజూ కొంత సమయాన్ని ధ్యాన సాధనకు వినియోగించాలని పిరమిడ్ సొసైటీ రాష్ట్ర ప్రచారకర్త స్వర్ణలక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక కె.రాంబాబు-లక్ష్మి దంపతుల స్వగృహంలో హనుమాన్ పిరమిడ్ కేంద్రాన్ని ప్రారంభించి అనంతరం ఆమె మాట్లాడారు. సమస్యల ఒత్తిడిని జయించడానికి, శారీరక, మానసిక విశ్రాంతికి ధ్యాన, జ్ఞాన సాధన ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో కానవరం రాంబాబు, దుర్గమాంబిక పిరమిడ్ సొసైటీ సభ్యులు తులసి, దుర్గ, అనిత మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల ప్రజలు కూడా పాల్గొని ధ్యాన సాధన చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజానగరం: జాతీయ రహదారిపై తూర్పుగానుగూడెం శివారులో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జగ్గంపేటకు చెందిన గొర్ల వెంకటరమణ(48) మంగళవారం మృతి చెందాడని స్థానిక సీఐ ఎస్.పి.వీరయ్యగౌడ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జగ్గంపేటలోని ఎంప్లాయీస్ కాలనీలో నివాసం ఉంటున్న గొర్ల వెంకటరమణ, తన భార్య స్వప్న, తొమ్మిదేళ్ల కుమారుడు రోహిత్ శ్రీరామ్‌తో కలిసి బైకుపై ద్వారకా తిరుమల వెళ్లి వస్తుండగా, తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ ఇంజినీరింగ్ కాలేజీ దాటిన తరువాత సోమవారం మధ్యాహ్నం ప్రమాదానికి గురయ్యారు. ఎదురుగా, అతివేగంతో రాంగ్‌రూటులో వచ్చిన మరొక బైకు ఢీకొన డంతో ముగ్గురు రోడ్డుపై పడ్డారు. ఈ సంఘటనలో వెంకటరమణ తలకు, రోహిత్ శ్రీరామ్‌కి వెన్నెముకకు బలమైన గాయాలు కాగా, స్వప్నకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక జీఎస్ఎల్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ వెంకటరమణ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై మనోహర్ దర్యాప్తు చేస్తున్నారు.

ఇవేండీ సంగోతులు

- ఛిద్రమైన రోడ్లు
- ప్రయాణికులకు తప్పని అగచాట్లు
- వర్షాలతో మరీ అధ్వానం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఇక వర్షం వచ్చిందంటే చాలు ఎక్కడ జారిపడి కూసాలు కదిలి పోతాయోనన్నట్టుగా ఉంటోంది. ద్వి, త్రిచక్ర వాహనాల్లో ప్రయాణించే వారి పరిస్థితి మాత్రం వర్ణనాతీతం. నూతన ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరచి రోడ్లు వేస్తారో.. లేక కళ్లు కాయలు కాచేలా ఎదురుచూడాలో తెలియని అయోమయ పరిస్థితిలో ప్రజలు, ప్రయాణికులు కొట్టుమిట్టాడుతున్నారు.

పెదపూడి: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు మరింతగా పాడైపోతున్నాయి. గోతులు పడి, పైకి లేచిన రాళ్లతో ఉన్న రోడ్లలో ప్రయాణం చేయాలంటేనే నరకం కనిపిస్తోంది. ఛిద్రమైన రోడ్లు ప్రమాదానికి నిలయాలుగా మారుతున్నాయి. దీంతో ఆ మార్గంలో ప్రజలు ప్రయాణాలు చేయాలంటేనే ఆందోళన చెందుతున్నారు. తీరా ప్రయాణం చేస్తే ఏ క్షణం ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలో నిత్యం వేల సంఖ్యలో ప్రయాణాలు సాగిస్తుంటారు. వేగంగా, రాత్రి సమయాల్లో ప్రయాణించే ప్రయాణికుల వాహనాలు అదుపుతప్పి ఆ గోతుల్లో పడి తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారు.

నియోజకవర్గంలోని రోడ్ల దుస్థితి ఇలా..

నియోజవర్గంలోని రంగంపేట మండలంలోని కోటపాడు నుంచి వెంకటాపురం రోడ్డు అధ్వానంగా తయారైంది. సింగంపల్లి బీలాలమ్మ ఆలయం వద్ద నుంచి మర్రిపూడి గ్రామాల మధ్య, మర్రిపూడి నుంచి పెద్దాపురం గ్రామాల మధ్య రోడ్డు పాడైంది. బిక్కవోలు మండలంలో ఊలపల్లి నుంచి బిక్కవోలు, కొంకుదురు నుంచి ఆరికరేవుల అర్‌అండ్‌బీరోడ్డు, కొంకుదురు నుంచి మెళ్లూరు, పందలపాక నుంచి ఊలపల్లి రోడ్డు బాగోలేదు. బిక్కవోలు నుంచి బలభద్రపురం కెనాల్ రోడ్డు మరి అధ్వానంగా ఉంది. అనపర్తి మండలంలోని అనపర్తి నుంచి బిక్కవోలు వరకు కెనాల్ రోడ్డు, అనపర్తి నుంచి ద్వారపూడి వరకు కెనాల్ రోడ్డు రాళ్లు పూర్తిగా మెటల్ పైకి లేచి ప్రమాదకరంగా ఉంది. పెదపూడి మండలంలో సంపర చింతపల్లి, కుమారప్రియం నుంచి గంగ్రేడు వరకు, కుమారప్రియం నుంచి కైకవోలు, చింతపల్లి, పైన, జి.మామిడాడ రామచంద్రపురం ఆర్ అండ్‌బీ రోడ్డులో వేండ్ర గ్రామం వద్ద రోడ్డు కుంగి ప్రమాదకరంగా ఉంది.



కుమారప్రియంలో ఛిద్రమైన రోడ్డు

పెదపూడి మండలాన్ని పరిశీలిస్తే..

మండలంలో కాకినాడ పైన ఆర్‌అండ్‌బీ రోడ్డులో పెద్దాడ గ్రామంలో రోడ్డుకు ఒక మీటరు వెడల్పుగా గోతులు ఏర్పడ్డాయి. ఇవి ప్రయాణికులకు సరిగా కనిపించకపోవడంతో వేగంగా వచ్చే ద్వి, త్రిచక్ర వాహనాదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జి.మామిడాడ రామచంద్రపురం ఆర్‌అండ్‌బీ రోడ్డులో వేండ్ర గ్రామం వద్ద 10 మీటర్ల మేర రోడ్డు కుంగి ఎత్తు పల్లాలుగా ఉండటంతో వాహనాలు ఆదమరిచి ప్రయాణిస్తే గోతుల్లో పడి పైకి లేచి కిందపడుతున్నాయి. లోడు, భారీ వాహనాలు ఏ కొంచెం అదుపుతప్పి ప్రయాణించిన ప్రమాదానికి గురికావలసిందే. సంపర-చింతపల్లి గ్రామాల మధ్య రోడ్డు పెద్ద పెద్ద గోతులతో రోడ్డు ప్రమాదానికి నిలయాలుగా ఉంది. సంపర గ్రామంలో సుమారు 100 మీటర్ల పొడవున రోడ్డు గోతులతో, రాళ్లు పైకిలేచి వాహనాలను ముందుకు కదలలేని విధంగా ఉంది. కుమారప్రియం, కైకవోలు గ్రామాల మధ్య సుమారు కిలోమీటర్ మేర రోడ్డు పది అడుగులకు ఒక గొయ్యి చొప్పున రోడ్డు ఉంది. పైన-చింతపల్లి గ్రామాల మధ్య రోడ్డు కుంగి వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితిలో ఉంది. దీనిపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణం రోడ్ల నిర్మాణానికి కృషి చేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



సంపర రోడ్డులో వర్షంతో ఛిద్రమై ఏర్పడిన గొయ్యి



బిక్కవోలు-సింగంపల్లి గ్రామాల మధ్య పాడైన రోడ్డు

గణపతి లడ్డూకు రూ.22,800



లడ్డూ కైవసం చేసుకున్న శ్రీనివాస్ దంపతులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక వెలమ పేట రామాలయం వద్ద ఏర్పాటు చేసి గణపతి ఆలయం వద్ద లడ్డూ పాట ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 22 కేజీల లడ్డూను పాటలో గ్రామానికి చెందిన మిడతాని శ్రీనివాస్-మంగ దంపతులు రూ.22,800కు కైవసం చేసుకున్నారు. లడ్డూ వేలం ద్వారా ఆలయానికి ఆదాయం వచ్చిందని ఆలయం చైర్మన్ కూనిరెడ్డి సాంబశివ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్య, ప్రయోజనాలపై అవగాహన

రాజానగరం: గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో కార్పొరేట్ హబ్ టెక్ వింగ్ ఆధ్వర్యంలో యువ ఇంజినీర్లకు ఇంజినీరింగ్ విద్య-ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రెడ్ హాట్ ఆసియా పసిఫిక్ లీడ్ శిరీష్ పాండే మాట్లాడుతూ జాబ్ మార్కెట్‌లో రెడ్ హాట్, లైనెక్స్ సంస్థల పాత్రను తెలియజేశారు. యువ ఇంజినీర్ల కోసం రెడ్ హాట్ సంస్థ 11 కోర్సులు, 7 అఫీషియల్ సర్టిఫికెట్ కోర్సులను అందజేస్తుందన్నారు. జీజీయూ టెక్ వింగ్ హెడ్ సీఎస్ అనిరుధ్ గౌర్ మాట్లాడుతూ ఈ కోర్సులు బహుళ జాతి సంస్థల్లో మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు పొందడానికి తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా స్వచ్ఛతాహి సేవ



అనపర్తిలో స్వచ్ఛతాహి సేవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



పెద్దాడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలు ఈనెల 17నుంచి అక్టోబర్ 2 వరకు సమర్థవంతంగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఆయన పెదపూడి, పెద్దాడ, తదితర గ్రామాల్లో నిర్వహించిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజా అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేయాలన్నారు. పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ యూనిట్లు వినియోగంలోకి తీసుకొచ్చి ఆయా గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూర్చే విధంగా కృషి చేయాలన్నారు. ఆయా గ్రామాల్లో ముందుగా స్వచ్ఛతాహి సేవా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచులు దోకుబుర్ర మీనాక్షి, కలవల కృష్ణమూర్తి, ఎన్డీఏ నాయకులు పుట్టా గంగాధర్ చౌదరి, ఆరుమిల్లి అమ్మన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అనపర్తిలో స్వచ్ఛతాహి సేవ ప్రారంభించిన ఎమ్మెల్యే

అనపర్తిలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం ప్రారంభించారు. స్థానిక మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.రామగురెడ్డి, డాక్టర్ సునీల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పిక్కలు కొరికేస్తున్న కుక్కలు



బూరుగుపూడి హైవేపై గుమికూడిన కుక్కలు

మధురపూడి: కోరుకొండ మండలంలో కుక్కల సంచారం బాగా ఎక్కువైంది. అవి రోడ్లపై గుంపులుగా తిరుగుతూ స్థానికులపై దాడి చేస్తున్నాయి. కుక్కకాటు వల్ల పలు సందర్భాల్లో విద్యార్థులు, వృద్ధులు తరచూ గాయపడుతున్నారు. మండల కేంద్రమైన కోరుకొండ శునకాల సమస్య మరీ తీవ్రంగా ఉంది. సంత మార్కెట్, శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం రోడ్డు, అంకాలమ్మ గుడి, గానుక వీధి, పోస్టాఫీసు, సుబ్రహ్మణ్యేశ్వరి స్వామి దేవాలయం సమీప ప్రాంతాల్లో వీటి సంచారం మరీ ఎక్కువ. కుక్కల దాడిలో ఈ ప్రాంతాలకు చెందిన పలువురు గాయపడ్డారు. ఒక్కోసారి పగటి పూట కూడా కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయి. అలాగే గాదరాడ, నిడిగట్ల, రాఘవాపురం, బొల్లెద్దుపాలెం, బూరుగుపూడి, కోటి గ్రామాల్లో కుక్కల దాడితో గాయపడినవారు అనేకమంది ఉన్నారు. అధికారులు జోక్యం చేసుకుని, కుక్కల బెడదను నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గంగమ్మ ఒడికి గణపయ్య..

పెదపూడి: వినాయక చవితి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా పదకొండో రోజు మంగళవారం జి.మామిడాడ, రామేశ్వరం, పెదపూడి గ్రామాల్లో గణనాథుడికి ఘనంగా నిమజ్జనం కార్యక్రమం భక్తులు చేపట్టారు. జి.మామిడాడ గ్రామంలోని ముఖ్య కూడలిలో నెలకొల్పిన గణనాథులను ఊరేగించారు. యువకులు, వివిధ నృత్యాలు, డప్పులు వాయిద్యాలు, మేళతాళాలతో, పెద్దఎత్తున బాణసంచా కాల్పుల నడుమ భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపు ఆయా గ్రామాల్లో ప్రధాన వీధుల గుండా సాగింది. భక్తులు వివిధ వేషధారణతో చేపట్టిన నిమజ్జనం అందరినీ ఆకట్టుకుంది. ఊరేగింపులో గణనాథుడికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు కమిటీ వారు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. జి.మామిడాడలోని ప్రసిద్ధ తుల్యభాగ నదీపాయ రేవులో, మిగిలిన గ్రామాల్లో పెద్ద కాల్వల్లో నిమజ్జనం చేశారు.

ఊరూరా గణపతి నిమజ్జనాల సందడి

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల మంటపాల్లో కొలువుదీరి తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణనాథులు నిమజ్జనానికి గంగమ్మ ఒడికి తరలుతున్నారు. వివిధ ప్రాంతాల్లోని జలాశయాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని గ్రామాల వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకలను నిర్వాహకులు పూర్తి చేశారు. సీతానగరం, చినకొండేపూడి, సింగవరం తదితర గ్రామాల వినాయకుని విగ్రహాలను వంగలపూడి రేవులో గోదావరి నదిలో నిమజ్జనం చేస్తున్నారు. సీతానగరం కమ్మవారి దిమ్మ వద్ద నెలకొల్పిన గణపతి విగ్రహాన్ని పెద్దఎత్తున బాణసంచా కాల్పుస్తూ, తీన్‌మార్ నృత్యాల మధ్య ట్రాక్టర్‌పై గ్రామంలో ఊరేగించారు. అనంతరం వంగలపూడి రేవులో నిమజ్జనం చేశారు. వంగలపూడి, మునికూడలి, ముగ్గళ్ల, బొబ్బిల్లంక రేవుల్లో గోదావరి నదిలో విగ్రహాల నిమజ్జనాలకు అధికారులు అనుమతి ఇచ్చారు. మునికూడలిలోని దేవాన్స్ ఘాట్ వద్ద గోదావరి నదిలో విగ్రహాల నిమజ్జనం జోరుగా సాగుతున్నాయి. నార్త్‌జోన్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, కోరుకొండ సీఐ సత్యకిషోర్, తహసీల్దార్ ఎ. శ్రీనివాస్, ఎస్సై రామ్‌కుమార్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు సీహెచ్ భూదేవి, తాడి ప్రసన్న, జి.రమ, అనిత తదితరుల పర్యవేక్షణలో విగ్రహాల నిమజ్జనాలు సాగుతున్నాయి. గోదావరిలో వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో కొన్ని రేవుల్లో నిమజ్జనాలపై అధికారులు ఆంక్షలు పెట్టారు.



జి.మామిడాడలో ఉత్సాహంగా గణేశ్‌ను ఊరేగిస్తున్న భక్తులు



సీతానగరం కమ్మవారి దిమ్మ వద్ద విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

జిల్లాలో 26,202 ఇళ్ల నిర్మాణాల పూర్తి

- కలెక్టరు పి.ప్రశాంతి

రాజానగరం: జిల్లాలోని పట్టణ ప్రాంతాలలో 36,958 మందికి, గ్రామీణ ప్రాంతాల్లో 6,349 మందికి నివాస స్థలాలు మంజూరు చేశామని, వాటిలో ఇంత వరకు 26,202 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని కలెక్టరు పి.ప్రశాంతి తెలిపారు. మరో 41 వేల నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయన్నారు. మండలంలోని కానవరం లే అవుట్‌లో మంతిన విజయలక్ష్మి, శ్రీనివాసరావు దంపతులతో మంగళవారం జరిగిన గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అదే కార్యక్రమంలో పాల్గొన్న రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ రాష్ట్రంలో కుల, మతాలకు అతీతంగా సమగ్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని చేతివృత్తుల వారికి మెరుగైన జీవనాధారం అందించే దిశగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాదరణ పొందే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. 2047 నాటికి భారత్ ప్రగతిలో అగ్రగామిగా నిలిచేలా వికసిత్ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అందులో ఆంధ్రప్రదేశ్ సమగ్ర ప్రగతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ కానవరం లేఅవుట్‌లో 808 మందికి పట్టాలు ఇచ్చారని, వీటిలో ఇంతవరకు 735 మంది శంకుస్థాపనలు చేస్తే, 45 మంది ఇంటి నిర్మాణాలు పిల్లర్స్ వరకు వచ్చాయని, 21 మంది గృహ ప్రవేశాలు చేశారన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, స్థానిక కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



గృహ ప్రవేశంలో పాల్గొన్న కలెక్టరు, ఎంపీ, ఎమ్మెల్యేలు

ఘనంగా డీ వార్మింగ్ డే



రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వీరన్న



కొంకుదురులో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీటీసీ కొంకుదురు పీవీ



విద్యార్థులకు మాత్రలను అందజేస్తున్న వైద్య సిబ్బంది

రాజానగరం: నేషనల్ డీవార్మింగ్ డే (జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం) సందర్భంగా మండలంలో 19,159 పిల్లలకు నులి పురుగుల నివారణకు సంబంధించిన ఆల్బెండజోల్ మాత్రలని పంపిణీ చేయాలనేది లక్ష్యం కాగా, మంగళవారం 19,109 మందికి అందజేశారు. స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పర్యవేక్షణలో స్థానిక రాజకీయ నాయకులు, ఉపాధ్యాయుల ద్వారా పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఈ మాత్రలని అందజేశారు.

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీన్ బి.శ్రీనివాస్‌రాజు, ఎన్ఎస్ఎస్ పీఓ బి.శ్రీనివాస్, రాజానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండల గ్రామాల్లో 97 శాతం పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసి మింగించినట్టు పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య తెలిపారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలనలో భాగంగా సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఎంపీడీవో రమేష్, ఎంఈవో కె.స్వామినాయక్, ప్రిన్సిపాల్ దొరబాబులు కళాశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్, అంగన్వాడీ సెంటర్లు, కళాశాలల్లో ఉన్న ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సు కలిగిన 12,601 పిల్లలకు గాను 12,252 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు మింగించామన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో..

సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు నులిపురుగుల నివారణ మాత్రలు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో అనేక వ్యాధులు నులిపురుగుల వలన సంక్రమిస్తాయని, చేతులు పరిశుభ్రంగా కడిగి, తాజా ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో అత్యధిక శాతం క్రిమికీటకాలకు ఆలవాలమై ఉంటుందని, పరిశుభ్రత పాటించడకపోతే జీర్ణాశయంలో నులిపురుగులు చేరి మన ఆరోగ్యాన్ని పాడు చేస్తాయని వివరించారు. అనంతరం మాత్రలు పంపిణీ చేసి పీహెచ్‌సీ సిబ్బంది విద్యార్థులతో మాత్రలు మింగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్బారావు, డాక్టర్ డి.నాగేశ్వరరావు, షేక్ మదీనా, వాణి, అలేఖ్య, రాజేశ్వరి, మీనాక్షి, రాజశేఖర్, వెంకటేష్, ఫణీంద్ర కుమార్, మనోహరి, ఎన్ఎస్ఎస్ పీవో ఎం.సుధామయి పాల్గొన్నారు

రంగంపేట: నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ దివ్యౌషధమని గ్రామ మాజీ ఉప సర్పంచ్ పోతుల వీర సుందరరావు(వీరన్న) అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాత్రలు వేసి అనంతరం ఆయన మాట్లాడారు. చిన్నారుల్లో రక్తహీనత, రోగాలకు కారణమవుతున్న నులిపురుగుల నివారణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రెండు సార్లు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నాయన్నారు. మండలంలో రంగంపేట, సింగంపల్లి పీహెచ్‌సీల పరిధిలో అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 8658 మంది పిల్లలు ఉండగా వారిలో 8479 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారన్నారు. మిగతా 179 మంది పిల్లలకు బుధవారం మాత్రలు వేస్తారని తెలిపారు.

బిక్కవోలు: చిన్నారుల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని కొంకుదురు ఎంపీటీసీ కొంకుదురు పీవీ అన్నారు. మంగళవారం కొంకుదురు ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థులకు మాత్రలు వేశారు. అన్ని ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అలాగే ఉన్నత పాఠశాల సర్పంచి సత్తి వీరమణి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచి కొవ్వూరి వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధురపూడి: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం ప్రజారోగ్యానికి శ్రీరామరక్ష అని కోరుకొండ మండల ఈవోపీఆర్డీ బి.మహేశ్వర ప్రతాప్ అన్నారు. మంగళవారం కోరుకొండ మండలంలోని 22 గ్రామాల్లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కోరుకొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాపవరంలో విద్యాశాఖ ఎంఈఓ కుశవలవ దొర ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కణుపూరు. శ్రీరంగపట్నం, దోసకాయలపల్లి, కోటికేశవరం, బూరుగుపూడి తదితర గ్రామాల్లో జరిగింది.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేదలకు ఉపయోగకరం



పీఎం ఆవాస్ యోజన గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీమణి వెంకటలక్ష్మి

మధురపూడి: ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా నిరుపేదలకు సొంతిల్లు సాకారమవుతోందని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు సందర్భంగా కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో ఆవాస్ యోజనలో నిర్మించుకున్న రెండు ఇళ్లను ఆయన ప్రారంభించారు. నిరుపేదలిద్దరికీ ఆ పథకంలో ఇళ్లు మంజూరయ్యాయి. వాటిని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేదలందరికీ పక్కా ఇళ్లు కల్పించాలన్న లక్ష్యంతో ఆవాస్ యోజన అమలు చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు మార్ని వీరాంజనేయులు, నాయకులు మార్ని రాము, దారా రాంబాబు, కర్రి రాజారావు తదితరులు పాల్గొన్నారు.